# నాట్యమయూరి

**మనోహర** దృశ్యానికి మధురమై భాష్యం చెప్పగల అత్యంత అధునాతన భవనమది. అది ఓ నాట్యాంగన తాలూకు వినోద మందిరం.

పచ్చిపాలలో సాయపసుపు రంగరించిన దేహఛాయ, మిసమిసలాడే వయసు సొగసులు, ఒంపుసొంపుల వయ్యారిభామ కాలిగజ్జె ఘల్లుఘల్లుమంటే రసిక హృదయాలు జిల్లుజిల్లుమని స్వరాలు పలుకుతాయి.

ఆ సుందరవదన కాటుక కనుచూపుల్లో గుండెలు తీసిన బంటుగూడా గుమ్మగా కరిగిపోవాల్సిందే. ఆమెరుపుతీగ నాట్యవిలాసం కాన్పూర్ కోటీశ్వరుల కల్పతరువు. అందుకే పట్టణ కళావతంసులంతా ఆమెను నాట్యమయూరి అంటున్నారు.

ఆ నాట్యాంగన అసలు పేరు అజీజన్... వృత్తి రసిక శిఖామణుల నుర్రూతలూగించడం.

అయినా ఆమె గుణవతి, శీలవతి. శ్రీమంతులు నాట్యానుభూతితో విసిరిన శ్రీలతో ఓలలాడే ఆ భవనంలో నిత్యకల్యాణము పచ్చతోరణము.

భారతావని నుదుటిమీద బ్రిటీష్‌పాలన రేఖలు బలపడిన రోజులవి. మొగల్ పాదుషాకు మస్కాకొట్టి ముగ్గురు బ్రిటీష్ వ్యాపారులు భారతదేశంలో చిల్లర వ్యాపారానికి శ్రీకారం చుట్టి మూడువేలకు ఎదిగారు. ఈస్టిండియా కంపెనీగా విస్తరించి, విడిపోయి పడిపోయిన వారి భూభాగాల నాక్రమించారు. దేశీయుల అనైక్యత నాసరాగా చేసుకుని విదేశీయులు పరిపాలన పగ్గాలు చేతబట్టి మప్పైవేలయ్యారు.

ముప్పయివేల తెల్లవారు మూడుకోట్ల భారతీయుల్ని నల్లచట్టాలనే ముల్లుకర్రలతో పొడుస్తున్నారు. తిన్న ఇంటి వాసాలను తిన్నగా లెక్కిస్తూ దత్తత స్వీకారం చెల్లదన్నారు, ఝాన్సీని బలవంతంగా ఆక్రమించి వీరవనిత లక్ష్మీబాయితో తగాదా పెంచుకున్నారు.

పీష్వా దత్తపుత్రుడైన రాజా నానాసాహెబ్‌ను గద్దెదించి మరాఠా రాజ్యాన్ని కబళించి వేయడానికని ఉవ్విళ్లూరుతున్నారు. భారతీయుల బతుకుబాటలో సుడిగుండాలు సృష్టిస్తున్నారు.

స్వేచ్ఛాపిపాసుల గుండెల్లో చిచ్చురగిలింది. తొందరపడి వసంతానికి ముందే కూసిన కోయిలను కాకులు పొడుచుకుతిన్నట్టు, పథకం ప్రకారం 31 మే 1857 నాడు భగ్గుమనాల్సిన భారత స్వేచ్ఛా విప్లవాగ్ని ముందే రగులుకుని చంద్రనిప్పులు కాకముందే చిందరవందరయి పోయింది. సిపాయిల తిరుగుబాటు ఛిద్రమైంది.

ఆవేశం ఆవహించి అనుకోని సమయంలో సమరశంఖారావం పూరించి భంగపాటు చెందిన మంగల్‌పాండేను ఉరిదీశారు. విదేశీపాలకులు వినూత్న రాక్షసులయ్యారు. చేజిక్కిన

భారతసిపాయిల కళ్లు ఊడబెరుకుతున్నారు. పట్టుబడిన సైనికులను చిత్రహింసలు పెడుతూ, ఒళ్లంతా దారుణంగా కుళ్లబొడుస్తూ హేయమైన ఊడిగంచేయించుకుంటున్నారు, భయం గుప్పిట్లో బతుకుతున్న అమాయకుల ఇళ్ల దోపిడి, గృహదహనాలు, మానభంగాలు నిత్యకృత్యాలైపోయినై.

ఈ దారుణమారణ హోమం ఇలా సాగాల్సిందేనా ? దగాపడిన నా దేశప్రజలిలా బానిసబతుకు లీడ్వాల్సిందేనా ? చిత్రహింసల పాలుకావాల్సిందేనా ?...

వీల్లేదు. తనువులు శాశ్వతం కాదు. సిరిసంపదలు వెంటరావు. దాస్యం కంటే మరణమే మేలు. స్వేచ్ఛా సమరరథం ఆగిపోక ముందుకు సాగాలి. ప్రాణాలు పోయినాసరే... నా దేశంలో స్వాతంత్ర్యభానోదయమవాల్సిందే. భారతీయులు స్వేచ్ఛావాయువులు పీల్చాల్సిందే...

ఊయల మంచం, పట్టుపరుపులో పవళించిన నాట్యమయూరి ఆలోచనలు వెనక్కు మళ్ళి ముందుకొస్తున్నాయి. గుండె పొగలు సెగలైపోతోంది. రాత్రి కరిగిపోతోంది. మెదడు పొరల్లో తరంగాలు తరిగిపోవడం లేదు, స్వేచ్ఛా సమరానికి ఇప్పుడు నాయకులెవ్వరు ? ఎక్కడున్నారు ? తెగని ఆలోచనలతో కునుకుపట్టడంలేదు.

తూరుపు వాకిలి ఎర్రబారుతోంది. అరుణవర్ణమైన ఆకాశం కిటికీలోంచి కనబడింది. నాట్యమయూరి అజీజన్ ఆరాటంతో పోరాటం ఓ కొలిక్కి వచ్చింది.

★★★

**"ఓ** నాట్యాంగన మీ దర్శనం కోరుతుంది ప్రభూ !"

పీష్వానానాసాహెబ్‌కు నమ్మిన బంటు, ఆప్తమిత్రుడు, సన్నిహిత సలహాదారైన తాంత్యాతోపే చకితుడై ప్రతీహారిని పరకాయించి చూశాడు. స్వాతంత్ర్యసమరంలో తలమునకలైన నాకోసం ఓ నాట్యంగన ! హృదయ కవాటములో ఓ చిరునవ్వు చిందువేసి చటుక్కున మాయమైంది.

"అయితే ప్రవేశ పెట్టు." అన్నాడాయన.

స్వేచ్ఛాపిపాసి, అరివీరభయంకరుడైన తాంత్యాతోపే అంతరంగం ఏవేవో పథకాలు రచిస్తోంది. అప్పటికే ఉషస్సులో వికసించిన తేజస్సులా ఓ సౌందర్యరాశి అతని ముందుకొచ్చింది. రెప్పవాల్చకుండా చూస్తోంది.

కండలు తిరిగిన శరీరం, స్ఫురద్రూపం, మొనదేలిన పొడగాటి మీసంకట్టు, ముత్యాలు పొదిగిన మరాఠా తలపాగా... మహానుభావు డితడేనా భారతజాతి ఆశాజ్యోతి... అజీజన్ ఎదలో ఆనందం, భక్తిపారవశ్యంతో చేతులు జోడించకుండా ఉండలేకపోయింది.

"ఎవరమ్మా నీవు ?" కంచుకంఠములో గాంభీర్యం.

"నా పేరు అజీజన్..." కోయిల గొంతు.

"ఓహో ! ఈ నగర ప్రముఖుల్ని నాట్యంతో ఉర్రూతలూగిస్తున్న నాట్యమయూరివి నీవేనా ?"

"అవును ప్రభూ !" విశాలనేత్రాలలో వింత కదలిక.

"రూపలావణ్య సంపన్నురాలివి, నాట్యకళామతల్లికి నిత్యనీరాజనాలర్పిస్తున్నదానిని, విలాస పురుషుల వినోదవస్తువైనదానివి... సర్వసంగపరిత్యాగినైన నాతో నీకేం పనమ్మా ?" అడిగాడు తాంత్యాతోపే.

"నేను నా వృత్తిని వదిలేశాను, మహానుభావా !" అన్నది అజీజన్.

పారే ఏరు దారిమళ్లిందంటే నమ్మవచ్చు కాని కోరచూపుల దోరవయసులో విలాస జీవితాన్ని వదిలేశానంటే నమ్మవచ్చా ?

"ఎందుకు ?" భృకుటి ముడిపడింది. నుదుటి అనుభవ రేఖలు వంకర్లు తిరిగాయి. మెడలోని రతనాలహారాలు కదిలాయి.

"అమాయకులయిన మనదేశ ప్రజలు పరాయి పాలకులకు ఊడిగంచేస్తూ అష్టకష్టాలనుభవిస్తుంటే నేను సుఖాల్లో తేలిపోవాలా" అజీజన్ గొంతులో ఆవేదన.

"ఈ దేశంలో కుటిలనీతితో కాలుమోపిన కొద్దిమంది విదేశీయుల చేతుల్లో కోట్లాది భారతీయులు కీలుబొమ్మలై ఆడుతుంటే నా గుండె తరుక్కుపోతుంది. ఈ అన్యాయాన్ని భరించలేక పోతున్నాను" అన్నదామె.

సౌందర్యదేవత నేత్రాల్లో కన్నీటి కణాలు మెరుస్తున్నై. లోపలినుండి పొంగుకొస్తున్న దుఃఖాన్ని అక్కడే అదిమిపెట్టింది. "చుట్టూ అలుముకున్న చీకటిని తిడుతూ కూచోవడం కంటే చేతనయిన చిరుదివ్వెను వెలిగించడం మేలుగదా ! మీరు నిర్వహిస్తున్న స్వాతంత్ర్య సమర యజ్ఞములో నేనూ ఓ సమిధనయి నా జీవితాన్ని సార్థకం చేసుకోవాలనుకున్నాను. ఈ బృహత్కార్యములో నేనేమి చేయాలో సెలవివ్వండి" కనుకొలుకులనుండి అశ్రువులు స్రవించి నున్నటి చెక్కిళ్లను తడిపేస్తున్నాయి.

సంభ్రమాశ్చర్యాలతో ఆయన తనువు పులకించింది. ఒళ్లంతా కళ్ళయిపోయినై. నిశితదృక్కులు ఆమెనాపాదమస్తకం తడిమాయి. తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"ధన్యురాలివి తల్లీ! నీలాంటి కూతురుకోసం మన దేశమాత ఎదురుచూస్తుంది తల్లీ!"

"దేహంకన్నా దేశం మిన్నగద అన్నా !" అజీజన్ కళ్ళల్లో ఆనందం. "పెంచి పోషించిన మాతృభూమి ఋణం తీర్చుకునే అవకాశం కల్పిస్తున్న మీకు శిరస్సువంచి నమస్కరిస్తున్నాను" భక్తితో ప్రణమిల్లింది.

అరివీరభయంకరుని ఆత్మలో ఆశాకిరణం జాగృతమైంది. "మన శక్తియుక్తులన్నీ మన దేశంకోసం ధారపోద్దాం తల్లీ !" అన్నాడాయన.

"ఇప్పుడు నేనేం చెయ్యాలో చెప్పండి"

తాంత్యాతోపె విచక్షణలో సంకల్పవికల్పాలు కొన్ని క్షణాలపాటు దోబూచులాడినై.

..... తెల్లవారి ఆలోచనాలోచనాలు ఎటుచూస్తున్నాయో, వారి కదలికలేమిటో, వ్యూహ

మేమిటో తెలుసు కోవడం కష్టమైపోతుంది. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రజల్ని సమరోన్ముఖుల్ని చేసేందుకు నేనెంతో తిరగాల్సివుంది. వారి రహస్యాలు తెలుసుకోవడం కత్తిమీది సాములాంటిది.

"తెల్లవారితో తగవు పడడం అంటే ప్రాణాలతో చెలగాటమని నీకు తెలుసామ్మా ?"

"తెలుసు. ఏనాడో ఒకనాడు ప్రాణాలు వదలక తప్పదు. ఆ ప్రాణాలను సత్కార్యం కోసం వినియోగిస్తాను. చెప్పండి. నేనేంచెయ్యాలో ఆజ్ఞాపించండన్నా !"

ఈమె నూటికి నూరుపాళ్ల నమ్మకస్తురాలు.

"నేను కాన్పూర్ విడిచి వెళ్తున్నాను. నా కదలికలు నీకు తెలుస్తుంటాయి. నీ నాట్య విలాసాన్ని చూపించి నువ్వా బ్రిటీష్ గుడారాల్లో చేరిపోవాలి. ఆటపాటలతో అక్కడి వాళ్ళందరినీ మెప్పించి వారితో సాన్నిహిత్యం సంపాదించాలి. నీ నటనా చాతుర్యం ప్రదర్శించి అక్కడి వార్తలు నాకు గుట్టుగా చేరవేస్తుండాలి"

మాటల్లో మర్యాదనిండి ఉంది. కాని అవి మొనదేలిన ములుకుల్లా గన్పించినై. ఎదపొదలో ఏదో అలజడి.

"నా ఆటపాటలన్నీ నా దేశప్రజల కోసమేనన్నా !" దుఃఖం పొరలు పొరలుగా తోసుకొస్తోంది.

"తెల్లదొరలంటే నాకసహ్యం. ఆ దౌర్భాగ్యుల ముందు గజ్జెకట్టాలంటే నా మనసొప్పడం లేదు".

నిర్వేదమైన చిరునవ్వు తాంత్యాతోపె పెదాలమీద అలా మెరిసి ఇలా మాయమైంది. "తప్పదమ్మా ! పటిష్టమైన గూఢాచార వ్యవస్థ లేకపోతే మనకు పరాజయం తప్పదు. మనవారిని అష్టకష్టాల్లో తోసిన బ్రిటీష్‌వారల ఎత్తులకు పైఎత్తులు వేయలేము..." దేశకాలపరిస్థితుల్ని సోదాహరణంగా వివరించాడు. "మన దేశసంపదలను, ధనమానప్రాణాలను దోచేస్తున్న తెల్లవారి నెదుర్కోవాలంటే ఇలాంటి సాహసం తప్పదమ్మా, గుండె రాయి చేసుకొని కార్యరంగంలో దూకకపోతే మనదేశమాత గుండె పగిలిపోతుందమ్మా. నువ్వా కార్యాన్ని సమర్థవంతంగా నిర్వహించగలవనే నమ్మకం నాకుందమ్మా"

తాంత్యాతోపె తపన అజీజన్ కర్థమైంది. అంతటి దేశభక్తుని ఆత్మవిశ్వాసాన్ని కాదనరాదు. ఆయన చెప్పినదానికి సరేనంది.

**మ**ర్నాడు తెల్లవారి సైనిక గుడారాలముందు తెగువతో గజ్జెకట్టింది. కాపలాదార్ల, సైనికుల మనసుల్ని చిత్తుచేసి గుడారాల అధికారి దాకా చేరుకుంది. నవ్వుతూ, నవ్విస్తూ, కితకితలు పెడుతూ అధికారి ముందు నాట్యం చేస్తూ ఇంద్రధనుస్సులా మెరిసింది. అతని గుండెలో గుసగుసలు రేపి సన్నిహితురాలైంది.

కోటి కోర్కెలు కొంగున ముడేసుకుని భర్త కౌగిట్లో కరిగిపోవాల్సిన కుసుమకోమల

సౌందర్యం కామాతురుడైన అధికారి కబంధహస్తాల్లో ఆహుతైంది. దేశానికి అంకితమైన అజీజన్ అందుకు చింతించలేదు.

కొద్దిరోజులలోనే నాట్యమయూరి తెల్లదొరల మురిపాలవల్లి అయింది. గుడారాల్లో ఎక్కడ తిరిగినా అడ్డుకునేవారు లేరు. బయటికెన్నిసార్లు వెళ్లినా అడిగేవారు లేరు. బ్రిటీష్‌దొరల కార్యకలాపాలు, వ్యూహాలు, సైనికుల కదలికలు తాంత్యాతోపేకు చేరిపోతున్నాయి.

తాంత్యాతోపె నేతృత్వంలో భారతవీరులు విజయపథంలో పయనిస్తున్నారు. తెల్లవారి ఎత్తులకు నల్లవారు పై ఎత్తులు వేస్తూ పలు ప్రాంతాలు గెలుచుకున్నారు.

కొద్దిరోజుల్లోనే కీలకస్థానమైన కల్పి తాంత్యాతోపె వశమైంది. భారతసేనల స్థావరమైంది. కల్పి కేంద్రంగా స్వేచ్ఛాసమరం కొత్తరూపు దిద్దుకుంటోంది.

బ్రిటీష్ పాలకుల దృష్టిలో తాంత్యాతోపె చిట్టడవిలో చిట్టెలుకయ్యాడు. గెరిల్లా యుద్ధ పద్ధతిలో దెబ్బతీస్తూ కొరకరాని కొయ్యగా మారాడు. బ్రిటీష్ సర్వసైన్యాధికారి సర్‌కొలిన్ కాంబెల్ పాలిటి సింహస్వప్నమయ్యాడు.

ఎత్తులన్నీ చిత్తయి పోతున్నందుకు కాంబెల్ అగ్రహోదగ్రుడయ్యాడు. కోపం నశాళానికంటింది. కల్లుదాగిన కోతి నిప్పుదొక్కినట్టు గంతులు వేస్తున్నాడు. తన వారిని నోటికొచ్చిన బండబూతులు తిడుతూ అధికారికి అక్షింతలేస్తున్నాడు. తాంత్యాతోపె అను చిట్టెలుకను వెంబడించి బోనులో బంధించి తీరాలని తమ సేనలను ఆదేశించాడు.

స్వయంగా వ్యూహం రచించి సింహాన్ని బంధించేందుకు వల విసిరాడు. అజీజన్ ద్వారా ముందు వర్తమానమందుకున్న తాంత్యాతోపె తప్పించుకుని క్షేమంగా కల్పి చేరుకున్నాడు. పనిలో పనిగా భిన్నత్వంలో ఏకత్వాన్ని మరిచిన రాజుల్ని, సంస్థానాధీశుల్నీ, జమీందార్లను సమావేశ పరిచి దేశం దీనావస్థను వివరించాడు.

"మనమంతా కలిసికట్టుగా విదేశీయులనెదిరించా"లని నొక్కి చెప్పాడు.

ధీరులలో దేశభక్తి పొంగింది. భీరుల నరాల్లో భయం ప్రవహించి గంగవెర్రులెత్తించింది. చర్కారీ ప్రభువు పైకి అనుకూలంగా నటిస్తూ లోలోపల తెల్లదొరల అడుగులకు మడుగులొత్తాలనే నిర్ణయించుకున్నాడు. చీకటిపరదాల్లో ప్రయాణించి బ్రిటీష్ గుడారాలు చేరుకున్నాడు. కాంబెల్ ముందువాలి కాళ్ళందుకున్నాడు.

కోరకుండానే కొన్ని కోటలు స్వాధీనమైనట్టు – తెల్లదొరలు మురిసిపోయారు, పసందయిన విందు జరిగింది.

చర్కారీ ప్రభువు బ్రిటీష్ ఆఫీసర్ల మంతనాలు అర్ధరాత్రిదాకా సాగాయి. చిట్టెలుకను గుట్టుగా పట్టెయ్యాలని పకడ్బందీ వ్యూహం తయారయింది.

హొయలు ఒలకబోస్తూ, మత్తుపానీయాలందిస్తూ అజీజన్ అంతా విన్నది. ఆమె గుండె గుబగుబలాడింది.

భారత ఆశాజ్యోతిని బందీ చేస్తారా ! దేశద్రోహి చర్ఖారీ ప్రభువు తన దేశస్తులపైనే కత్తికడతాడా ! వీల్లేదు. స్వేచ్ఛా సమరనేత ఎట్టి పరిస్థితిలోనూ చావుదెబ్బ తినరాదు. అదే రాత్రి బయలుదేరింది.

నుదుట రూపాయిబిళ్లంత బొట్టు, పాపిటలో సింధూరం, ముక్కుకు ముత్యాల ముక్కుపుడక, తలమీదముసుగు. మరాఠా ముత్తైదువలా వేషం సంతరించుకుంది.

అడ్డంకులనధిగమిస్తూ తాంత్యాతోపేను చేరుకుంది. ఆమె చెప్పింది అంతావిని తాంత్యాతోపే అవాక్కయ్యాడు. హృదయం ఉప్పొంగిపోయింది. "నువ్వింత సాహసివనుకో లేదమ్మా. నీకు చేతులెత్తి మొక్కాలన్పిస్తుంది చెల్లీ !" అన్నాడాయన.

ఆయన అన్నమాటలకు ఏనుగుమీదెక్కి ఊరేగినంత సంతోషమైంది అజీజన్‌కు.

అదే సమయంలో... తాంత్యాతోపేను త్వరలో బంధించేందుకు ఎదురులేని పథకం తయారైన సంతోషం గుడారాల అధికారినలరించింది. అజీజన్ అధరామృతాన్ని తనివిదీరా తాగుతూ స్వర్గసుఖాలనుభవించాలనే కోరిక చెలరేగింది.

తహతహలాడుతూ అజీజన్ కోసం గుడారాలన్నీ వెతికించాడు. కానీ ఆమె ఎక్కడా కనబడలేదు. గుడారాలు విడిచి వెళ్లిందని కాపలాదార్లు తెలిపారు. గంగవెర్రులెత్తి గంతులేశాడు. కాళ్లూ చేతులు కొట్టుకుని కూలబడిపోయాడు.

చర్ఖారీ ప్రభువును చంకనెక్కించుకుని తాంత్యాను బంధించి, అతని తోలువొలిచి తోలుబొమ్మ చేయిస్తానని కమ్మని ఊహల్లో తేలిపోయాడు కాంబెల్. శక్తియుక్తుల్లో ఆరితేరిన జనరల్ హగ్‌రోజ్‌కు తాంత్యాకు బంధించే బాధ్యత అప్పగించి నిశ్చింతగా నిద్రపోయాడు.

జనరల్ హగ్‌రోజ్ సైన్యసమూహాన్ని వెంటబెట్టుకుని ఆత్మవిశ్వాసంతో బయలుదేరాడు. రహస్యమార్గంలో పయనిస్తున్నాడు. కానీ... ఝాన్సీ పొలిమేరల్లో అతణ్ణి భారతసేనలడ్డుకున్నాయి. పథకం తలకిందులైనందుకు హగ్‌రోజ్ బుర్రగిర్రుమంది. అతని కలలు కల్లలయిపోయినై. గెరిల్లా యుద్ధంలో గెలువలేక అపజయాన్ని అంగీకరించి పలాయనం చిత్తగించాడు.

ఒకేరోజు జరిగిన పోరాటంలో బోలెడన్ని తుపాకులు, మందుగుండు సామాగ్రి, మూడు లక్షల రూపాయల నగదు మూటలు భారత సైన్యాల వశమైనాయి.

అంతేకాదు, దేశద్రోహి చర్ఖారీ ప్రభువు పెడరెక్కలు విరిచికట్టి తాంత్యాతోపే పాదాల ముందు పడేశారు సైనికులు.

తెల్లదొరల మొహాలు నల్లబారిపోయినై. అవమానం అగ్నియై జనరల్ కాంబెల్‌ను దహించి వేస్తుంది. గుడారాల్లోంచి రహస్యాలెలా బయటికెళ్తున్నాయని అధికారిని నిలదీశాడు. మొహంవాచేలా చీవాట్లు పెట్టాడు. దాంతో ఆ అధికారి బుర్రలో అజీజన్ పట్ల అనుమానం పొడచూపింది.

పకడ్బందీ వ్యూహం పచ్చిపులుసై ఎలా కారిపోయింది ? వైస్రాయ్ కానింగ్, పర్వ

సైన్యాధికారి కాంబెల్ హామీ మాటలు నీళ్లమూటలెలాగైపోయినై ? చర్కారీ ప్రభువుకా గతి ఎలా పట్టింది ? పై ప్రశ్నలకు సమాధానాలు దొరక్క బ్రిటీష్ గుడారం బిత్తరబోయింది. అధికారి ప్రియురాలు అజీజన్ తాంత్యాతోపె ఏజంటు కావచ్చని ఎవరో గుసగుసలాడారు. అధికారి అది విన్నాడు. క్షణాల్లో అజీజన్‌ను తన సమక్షానికి రప్పించాడు.

పళ్లు పటపటలాడిస్తూ - "నువ్వారోజు రాత్రి ఎటు వెళ్ళావు ?..." నిగ్గదీశాడు.

అజీజన్ గుండె ఒక్కసారిగా ఝుల్లుమంది.

అయినా భయపడలేదు. "ముఖ్యమయిన పనిమీద బయటికెళ్లాను" అని నిబ్బరంగా జవాబిచ్చింది.

అధికారి అనుమానం బలపడింది, కళ్లు చింతనిప్పులైనాయి. "ఏమిటా పని ?" రాక్షసత్వం ఆవహించింది. చెంపలు ఛెళ్లుఛెళ్లుమనిపించాడు.

అజీజన్ కళ్లల్లో మెరుగులు దూకులాడినై.

బ్రిటీష్ సైనికులు చుట్టూ చేరి ముందు గుసగుసలాడారు. ఆ తర్వాత బూతులు తిడుతున్నారు. తన పరిస్థితి ఏమిటో అజీజన్ కర్థమయిపోయింది. ఆ పరిస్థితిలో మౌనమే శరణ్యమనుకుంది.

"నువ్వు వెళ్లి ఆ తాంత్యాతోపేను కలిశావు ! మా రహస్యాలు చేరవేశావు గదూ !" కోపంతో ఊగిపోతూ కొరడా అందుకున్నాడు అదికారి.

అజీజన్ నోరు తెరవలేదు. ధైర్యంగా నుంచుంది. తాంత్యాతోపేను తలుచుకుని 'నా కర్తవ్యం నేను నిర్వహించానన్నా !' అనుకుంది.

నాట్యమయూరి కోమల శరీరమ్మీద కొరడా వీరవిహారం చేసింది. జోరందుకున్న ఒక్కోదెబ్బ శరీరమ్మీంచి చర్మాన్ని ఒలిచేస్తుంది. ఒంటినిండా గాయాలతో శరీరం గోగుపూవైంది.

ఆమె హాహాకారాలు గుడారాల్లో మర్మోగాయి. అయ్యో ! పాపం అనేవారు లేరు. అంతా ప్రతీకారేచ్ఛతో ఊగిపోతున్నారు. చెక్కుటద్దాలాంటి చెక్కిళ్ళమీద సూదులతో పొడుస్తూ "చెప్పు ! తాంత్యాతోపే ఎక్కడున్నాడు. అతని వ్యూహమేమిటి ?" అడిగారు. ప్రాణాలు విలవిల్లాడిపోయినై. మళ్లీ అడిగారు.

"నాకు తెలీయదు" గట్టిగా అరిచింది.

"ఆడదానివని చేరదీస్తే అన్యాయం చేస్తావా ? మమ్మల్ని నమ్మించి మోసం చేస్తావా ద్రోహీ ?" కత్తితో రొమ్ముమీద పొడుస్తూ పైశాచికంగా నవ్వాడో సైనికుడు. నరకయాతన అనుభవిస్తూంది. రక్తం చిమ్ముతోంది.

"హమ్మా... అల్లా !" శక్తులన్నీ కూడదీసుకుంది.

"ఎవర్రా ద్రోహి ?" రోషంతో ప్రశ్నించింది....

... "తిండికి లేక బతుకుదెరువు కోసం నాదేశానికొచ్చి... నయవంచనతో నక్క...

నక్కజిత్తులతో తిష్టవేసి... అమ్... అమాయకులైన నా దేశవాసులతో వ్వ్యా... ఊడిగం చేయించు కుంటున్న న్ను...ను...నువ్వా, నేనా ?" కాండ్రించి మొహమ్మీద ఉమ్మేసింది.

అవమానం, ఘోర అవమానం.

తెల్ల సైనికుని తుపాకి బాయినెట్ అజీజన్ పొత్తికడుపులోకి దూసుకుపోయింది. గిలగిల్లాడింది.

"యాహ్ అల్లా..." ఆడకూతురు అంగలార్పుకు దిక్కులు పిక్కటిల్లిపోయినై.

"మంచిపనైంది. వెరీగుడ్" అధికారి వికటాట్టహాసం.

జనారణ్యంలో అజీజన్ జవజీవాలు క్షీణదశకు చేరుకున్నాయి. కళ్ళు మసకబారినై. పొత్తికడుపులోంచి బయటికొస్తున్న పేగుల్ని అరచేతుల్తో అదిమిపట్టింది.

పెదాలు మెల్లమెల్లగా కదులుతున్నాయి.

"అల్లా... నా దేశం కోసం నాదంతా సమర్పించాను. ఆ... అపైన నీదయ" శరాఘాతానికి వృక్షాగ్రం నుండి నేలకూలిన కపోతంలా కుప్పకూలిపోయింది.

"అల్లా ! నీముంగిట్లో ఆలస్యముంది, క్కా...కాని అంధకారం ల్లే...లేదుగా !" నాలుక మొద్దుబారిపోతోంది. "నా దేశయ్యు...యువత ఇక నిద్దురపోదు. ఏనాటికైనా తెల్లకుక్కల్ని ఈ దేశంనుండి తత... తరిమేస్తుంది. హిందుస్థాన్... జి...జి...జిందాబాద్"

గొంతు తాడిరిపోయింది. మంచినీళ్లు కావాలని కుడి అరచేతిని పెదాల కానించుకుని సైగచేసింది.

నేల రక్తం మడుగైంది. పగలబడి నవ్వుతూ సైనికులకేదో సైగచేశాడు అధికారి. ఆమె అధరామృతం కోసం అహోరాత్రులు అర్రులు చాచిన బ్రిటీష్ సైనికుల మూత్రం ఆ పెదాలమీద జల్లుజల్లున రాలింది.

అంతే అజీజన్ పంచప్రాణాలు పంచభూతాల్లో కలిసి శూన్యాంకమైన ఇహలోకం నుండి పూర్ణాంకమైన పరలోకానికి పయనించాయి.



**23.8.2002**
**'స్వాతి' వారపత్రికలో**
**ప్రచురితమైంది.**